సాక్షి సంగారెడ్డి
బుధవారం । 29 । జనవరి । 2025



కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

బాలికల్లో ఆరోగ్యంతోపాటు ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందట తెచ్చిన బాలికల సమగ్ర పథకం సత్ఫలితాలనిస్తోంది.

వివరాలు 8లో ▸

ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా జ్యోతిరెడ్డి



నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీకి కొత్త కమిషనర్‌గా జ్యోతిరెడ్డికి ఇన్‌చార్జిగా బాధ్యతలు కేటాయించారు.

వివరాలు 9లో ▸



కొడకంచి జాతర చూద్దాం..

తెలంగాణ దక్షిణ కంచిగా ప్రసిద్ధి చెందిన శ్రీదేవి భూదేవి సమేత ఆదినారాయణస్వామి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది.

వివరాలు 9లో ▸

మతోన్మాదంపై పోరు

- ఎంఎస్‌పీపై ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ధ్వజం
- ముగిసిన సీపీఎం రాష్ట్ర మహాసభలు



సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో జిల్లా సీపీఎం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధి పొందుతోందని, ఈ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్‌లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన ఎన్నికల్లో జాన్ వెస్లీ సీపీఎం నూతన రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు 60 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాన్‌వెస్లీని పార్టీ నాయకులు అభినందించడంతోపాటు సన్మానించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ... ఈ మహాసభలో రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానాలు చేశామన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రైతాంగ సమస్యల్ని కాంగ్రెస్ విస్మరించింది

రైతాంగం పండిస్తున్న పంటలకు కనీసం మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానం చేసినట్లు వెస్లీ పేర్కొన్నారు. ఆరు పంటలకు బోనస్ ఇస్తామని నాలుగు పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా రైతాంగ సమస్యలను పక్కన పెట్టిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కోటి 30 లక్షల మంది కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ప్రధాని మోదీ విడుదల చేసిన కనీస వేతనాలు జీవో సిగ్గుచేటుగా ఉందన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది పేదలకు సొంత ఇల్లు లేదని వారంతా సీపీఎం నాయకత్వంలో గుడిసెలు వేసుకుని పోరాడుతున్న వారందరికీ మద్దతుగా ఉద్యమాలు చేపట్టేందుకు మహాసభ తీర్మానించిందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గం సభ్యులుగా నాగయ్య, వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, చుక్కా రాములు, జ్యోతి, మల్లు లక్ష్మి, పాలడుగు భాస్కర్, సాగర్, అబ్బాస్, ప్రభాకర్ తిరిగి ఎన్నిక కాగా నూతన కార్యదర్శి వర్గ సభ్యుడిగా బండారి రవికుమార్, నాగేశ్వర్, జహంగీర్‌లు ఎన్నికయ్యారు.

రాష్ట్ర కార్యదర్శిగా వైదొలిగిన తమ్మినేని

తెలంగాణలో మూడు పర్యాయాలు రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన తమ్మినేని వీరభద్రం సంగారెడ్డిలో జరిగిన మహాసభల్లో ఆ పదవినుంచి తప్పుకున్నారు. వయసు, అనారోగ్యం రీత్యా రాష్ట్ర కమిటీ బాధ్యతల నుంచి ఆయన వైదొలిగారు. అదేవిధంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులుగా పనిచేసిన చెరుపల్లి సీతారాములు, డీజీ నర్సింగరావు సైతం రాష్ట్ర కార్యదర్శి వర్గం నుంచి రిలీవయ్యారు.

అందోల్‌లో నవోదయ పాఠశాల

- మూడు నెలల్లో మినీట్యాంక్‌బండ్ నిర్మాణం
- మంత్రి దామోదర జోగిపేట మున్సిపాలిటీలో పర్యటన



చెరువుకట్టను పరిశీలిస్తున్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): అందోల్‌లోనే నవోదయ పాఠశాలను ఏర్పాటు కానుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. అందోల్‌లోని 1141 సర్వేనంబరులోని ప్రభుత్వ స్థలంలో 30 ఎకరాల్లో పాఠశాల నిర్మాణానికి అనువైన చోటును ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. జోగిపేట-అందోల్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం పర్యటించారు. అందోల్ చెరువులో పర్యా టకుల కోసం బోటింగ్, కట్టపై హరిత రెస్టారెంట్, కట్టపై వాకింగ్ ట్రాక్ వంటివి చేపట్టాలని సూచించారు. పెద్ద చెరువు పనులను స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల గురించి ప్రజారోగ్య, వైద్య విభాగం అధికారులు, మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ కార్యాలయ రోడ్డు నుంచి చెరువుకట్ట వరకు ఉన్న కి.మీ రోడ్డు పనులతోపాటు కట్టపై లైట్లు, సీసీ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలన్నారు. శివారులోని ప్రభుత్వ స్థలంలో నర్సింగ్ కళాశాల, 150 పడకల ప్రభుత్వాసుపత్రి, మైనార్టీ బాలుర, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలు, మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాల, బీ-ఫార్మసీ కళాశాలతోపాటు స్వామి వివేకానంద విగ్రహం వద్ద రెండు ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు వీలుగా స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అందోల్ పెద్ద చెరువు కట్టను మూడు నెలల్లో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎన్‌టీఆర్ స్టేడియంలో వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి ఆటలు ఆడేందుకు అనుకూలంగా మార్చాలని, మల్టీపర్పస్ స్టేజీని ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి వెంట ఆర్‌డీవో పాండు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి కుమార్, టూరిజం డీఈ నటరాజ్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఫెన్సింగ్ తొలగింపు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పద్మావతినగర్‌కు వెళ్లే దారికి అడ్డుగా ఉన్న ఫెన్సింగ్‌ను మంగళవారం హైడ్రా అధికారులు తొలగించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇతరులు తమకు ఇబ్బంది కలిగించేలా రేకులతో ఫెన్సింగ్ నిర్మించారని పద్మావతి కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.



ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా పీసీబీ ఉలుకేదీ!



పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయుకాలుష్యం

జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో నిత్యం ఉదయం సాయంత్రం వేళల్లో రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయుకాలుష్యంతో ఊపిరి తీసుకోలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలను గుర్తించి పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

–జిన్నారం (పటాన్‌చెరు)

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు
- కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి. చిత్రంలో అధికారులు

సంగారెడ్డి జోన్: ఈ ఏడాది మార్చి 5 నుంచి 25వరకు జరగనున్న ఇంటర్‌పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఇంటర్ పరీక్షల సమన్వయ సమావేశంలో క్రాంతి మాట్లాడారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలు, ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 3 వ తేదీ నుంచి జరిగే ప్రాక్టికల్ పరీక్షలు, జనరల్ ఒకేషనల్ కోర్సులకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో పరీక్షలకు 15,984 మంది విద్యార్థులు, ఒకేషనల్ పరీక్షలకు 1,681 మొత్తం 17,665 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విభాగంలో 17,057, ఒకేషనల్ పరీక్షలకు 1,431 మొత్తం 18,488 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో తాగునీటి, పారిశుద్ధ్య, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఆయా గ్రామ పంచాయతీల సెక్రటరీలు, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా ఆయారూట్లలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సు సర్వీసులను నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇంటర్మీడియెట్ అధికారి గోవిందరామ్, జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ మురళీ, ఆర్డీవో అరుణ, జిల్లాలోని వివిధ డివిజన్ల ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులు, పోలీసు శాఖ, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే ప్రాణాలు తీస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

- జిల్లాలో ప్రతిఏటా రోడ్డు ప్రమాదాల్లో 450కి పైగా మృత్యువాత
- జిల్లా ఎస్పీ రూపేశ్

జహీరాబాద్: వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లా ఎస్పీ రూపేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఎన్.కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు మద్యం తాగకుండా ఉండాలని, జంక్షన్ల వద్ద రోడ్డు క్రాస్‌చేసే సమయంలో ఇరువైపులా చూసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలన్నారు. నాలుగు చక్రాల వాహనంలో సీటు బెల్టును, ద్విచక్ర వాహనాలపై విధిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. జిల్లాలో ప్రతీ ఏటా రోడ్డు ప్రమాదాల్లో 450 మందికి పైగా మరణిస్తున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ తమ వంతుగా అవగాహన సమావేశాలను నిర్వహిస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారి కుటుంబ సభ్యులు హాజరై తమ ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పోలీసుల తరపున ఆర్థిక సహాయం అందజేశారు. సమావేశంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐలు శివలింగం, హన్మంతు, ఎంవీఐ వెంకటయ్య, ఎస్ఐలు కాశీనాథ్, ప్రసాద్‌రావు, రాజేందర్‌రెడ్డి, సతీష్, నరేష్, ఆయా పాఠశాలల విద్యార్థులు, వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

‘భరోసా’ లెక్కలు తేలాయి

- నారాయణఖేడ్ డివిజన్‌లో సాగేతర భూమి 1,294 ఎకరాలు
- ఈ భూములకు రైతు భరోసా మినహాయింపు

కంగ్టి(నారాయణఖేడ్): వ్యవసాయానికి యోగ్యమైన భూములకే పెట్టుబడి సాయం అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ రైతు భరోసా పథకంకు సంబంధించి సాగు, సాగేతర భూములపై స్పష్టత వచ్చింది. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. కాగా, ఖేడ్ వ్యవసాయ డివిజన్‌లోని మండలాల్లో 1,294 ఎకరాలను సాగేతర భూమిగా అధికారులు గుర్తించి రైతు భరోసా పథకంనుంచి మినహాయించారు.

మండలాల వారీగా...

మండలాలవారీగా కల్హేర్‌లో 26.24 ఎకరాలు, కంగ్టిలో 23.22, మనూర్‌లో 124.17, నాగల్‌గిద్దాలో 160.16, నారాయణఖేడ్‌లో 806.35, నిజాంపేట్‌లో 90.32, సిర్గాపూర్‌లో 63.02, కంగ్టిలో 23.22 ఎకరాల సాగేతర భూమిగా అధికారులు గుర్తించారు. ఖేడ్ డివిజన్ పరిధిలో మొత్తం 2,00,963 ఎకరాల వ్యవసాయ భూమిలో 1,294.08 ఎకరాలు మినహాయిస్తే రైతు భరోసా పథకానికి అర్హమైన భూమి 1,99, 675.12 ఎకరాలుగా గుర్తించారు. ఈ లెక్కల ప్రకారం రైతు భరోసా సంబంధిత రైతుల ఖాతాల్లో జమకావల్సి ఉంది.

ఆత్మీయ భరోసా భేష్

భూమిలేని వ్యవసాయ కూలీల కోసం నూతనంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో కూలీలకు మంచి లబ్ధి చేకూరుతోంది. కంగ్టి మండలంలో 974 మందిని భూమిలేని వ్యవసాయ కూలీలుగా గుర్తించి వారికి ఏటా రూ.1,2000లు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో వ్యవసాయ కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది. డివిజన్ పరిధిలో ఆరు వేలకు పైగా ఆత్మీయ భరోసా లబ్ధిదారులు ఉన్నారని సమాచారం. 6 వేలకు పైగా వ్యవసాయ కూలీలుగా గుర్తించడంతో ఉపాధి కూలీల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.



కంగ్టిలో వ్యవసాయభూమిలో జొన్నసాగు

ఇంకెన్నాళ్లు.. ఎన్నేళ్లు!

- జిల్లాలో 441 పాఠశాల భవనాల నిర్మాణాలు మంజూరు
- మూడేళ్లలో 180 పాఠశాల భవనాలు మాత్రమే పూర్తి
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అసంపూర్తిగా హత్నూర పాఠశాల భవనం, భోజనశాల

హత్నూర(సంగారెడ్డి): విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో అమలుకు ఆమడ దూరంలో ఉంటున్నాయి... గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాలు నిధుల కొరతతో నిలిచిపోయాయి. అయినా పాఠశాల భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలన్న ఆలోచన అధికారులకు ప్రజాప్రతినిధులకు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ‘మన ఊరు మన బడి’పథకం ద్వారా జిల్లాలోని 441 పాఠశాలలకు నూతన భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసింది. సుమారు మూడేళ్లు గడిచినా భవన నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి.

అరకొరగా పనులు...

జిల్లాలోని వివిధ గ్రామాలలో రూ.63.96 కోట్లు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల నిర్మాణం పనులు అరకొరగా చేశారు. కానీ ప్రభుత్వం విడుదల చేసిన నిధులు మాత్రం రూ.45.61 కోట్లు మాత్రమే. ఇంకా చేసిన పనులకు రూ.18.35 కోట్లు ఇంకా పనులు చేసిన ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నిధుల కొరతతో జిల్లాలో కేవలం 180 పాఠశాల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ‘మన ఊరు మనబడి’, ‘మన బస్తీ మనబడి’పథకంలో పాఠశాల భవన నిర్మాణాలు, భవన మరమ్మతులు, వంటగది, మరుగు దొడ్లు, ప్రహరీగోడ, భోజనశాల, గదిలో పిల్లలు కూర్చోవడానికి డెస్కులు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయునికి టేబుల్ కుర్చీలు ఈ పథకం ద్వారా నిధులు ఖర్చు పెట్టి సమకూర్చాలి. కానీ నిధుల కొరత ద్వారా అసంపూర్తి భవనాలు జిల్లాలో దర్శనమిస్తున్నాయి. విద్యాభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నా పాలకులు క్షేత్రస్థాయిలో మాత్రం విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు వాపోతున్నారు. జిల్లాలో కొన్ని శిథిలావస్థలో ఉన్న భవనాలలోనే వి ద్యార్థులు చదువులు సాగదీస్తున్నారు. హత్నూర మండలంలో 20 పాఠశాలల్లో ‘మన ఊరు మనబడి’కింద ఎంపిక చేసి పనులు పూర్తయినప్పటికీ కేవలం మంగాపూర్, బోరపట్ల పాఠశాలలు మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగతా 18 పాఠశాలల పరిస్థితి అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా అసంపూర్తి పాఠశాలల భవన నిర్మాణాలు పూర్తయ్యేలా నిధులు విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మూడేళ్లయినా పట్టించుకోవడం లేదు



పాఠశాల నిర్మాణం ప్రారంభించి మూడేళ్లు కావస్తుంది. పాఠశాల భవనం అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోని అసంపూర్తి నిర్మాణాన్ని పూర్తి చేయాలి. పలుమార్లు అధికారులకు,ఎమ్మెల్యేలకు చెప్పాం. అయినా పనులు సాగడం లేదు.

–దుర్గేశ్, విద్యార్థి తండ్రి హత్నూర

ఇబ్బంది పడుతున్నాం సారు



పాఠశాల భవనం పూర్తి కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం సారు... అసంపూర్తి పాఠశాల భవనంలోనే చదువులు సాగిస్తున్నాం. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తి పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలి.

–నందిని, విద్యార్థిని, హత్నూర

నిధుల కొరతతో నిలిచిపోయాయి



మన ఊరు మన బడి పథకం ద్వారా మంజూరైన పాఠశాల భవనాలు నిధుల కొరతతో అసంపూర్తిగా ఉన్నాయి. సుమారు 180 వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే నిర్మాణాలు పూర్తయితాయి.

–వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

న్యూస్‌రీల్

రావి పత్రాలపై విరిసిన ‘పద్మా’లు



నారాయణఖేడ్: ఇటీవల ‘పద్మ’అవార్డులు పొందిన డా.దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి, నందమూరి బాలకృష్ణ, మందకృష్ణమాదిగలను సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన పత్రచిత్రకారుడు గుండుశివకుమార్ రావి ఆకుపై ఇలా చిత్రించి శుభాకాంక్షలు తెలిపారు.

గణిత ప్రశ్నల దీపిక ఆవిష్కరణ



గణిత ప్రశ్నల దీపికను ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో మంగళవారం జెడ్పీహెచ్ఎస్ బొల్లారం గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ఎన్ ప్రసాద్ రూపొందించిన 10వ తరగతి గణిత ప్రశ్నల సంకలన దీపికను మంగళవారం డీఈవో వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... గణిత దీపిక విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ గణిత దీపికను జిల్లాలోని ప్రతీ పాఠశాలకు పంపిస్తామని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు విద్యార్థులతో అభ్యాసం చేయించి జిల్లాలో గణితశాస్త్రంలో వంద శాతం ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డీఈవో గణిత దీపిక రూపకర్త ప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ గారు, సీఎంవో వెంకటేశం, ఏసీజీఈ పండరీనాయక్, తెలంగాణ గణిత ఫోరం అధ్యక్షుడు సిద్దేశ్వర్,గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

సంగారెడ్డి టౌన్: పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంలో మంగళవారం ఆయన సబిత ప్రతిభావంతుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు న్యాయపరమైన విషయంలో ఉచిత సహాయం అందిస్తామని తెలిపారు.

ప్రమాదాలు తగ్గుముఖం

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత
- ఉత్తమ డ్రైవర్లకు సన్మానం



డ్రైవర్‌ను సన్మానిస్తున్న రీజినల్ మేనేజర్ ప్రభులత తదితరులు

జహీరాబాద్‌టౌన్: డ్రైవర్లు భద్రత నియమాలు పాటించడం వల్ల ఈ ఏడాది ఆర్టీసీలో ప్రమాదాలు తగ్గాయని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జహీరాబాద్ డిపోలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అతివేగం, అజాగ్రత్తే ప్రమాదాలకు కారణమన్నారు. ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైన శంకరయ్య,వినోదయ్య, పీఎస్ రెడ్డితోపాటు పలువురు ప్రైవేట్ డ్రైవర్లను ఈ సందర్భంగా ఆమె సన్మానించారు. కార్యక్రమంలో బుధేరా గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మాధవి, వైస్ ప్రిన్సిపల్ ప్రవంతి, డీఎం.జాకీర్ హుసేన్,అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, సూపర్‌వైజర్ తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ నివారణకు కృషి చేయండి : డీపీఓ


శానిటరీ కప్‌లను అందిస్తున్న డీపీఓ దేవకీదేవి

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ మహిళలు ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి దేవకీదేవి అన్నారు. మంగళవారం తోటపల్లిలో నిర్వహించిన రుతు ప్రేమ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. ఇళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించి స్టీల్, పేపర్, క్లాత్ బ్యాగులను ప్రోత్సహించాలన్నారు. మహిళల ఆరోగ్యం కోసం, పర్యావరణ పరిరక్షణకు రుతు ప్రేమ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్లాస్టిక్ కెమికల్స్ కలిగిన ప్యాడ్స్ వల్ల మహిళల ఆరోగ్యంతోపాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. మెడికల్ గ్రేడ్ సిలికాన్ తయారు చేసిన శానిటరీ కప్‌లను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ వెంకటేశ్వర్లు, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓలు రమేశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.20 లక్షలు స్వాహా

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో ఓ మహిళ రూ.20 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగినికి డిసెంబర్ 13వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడుతూ వచ్చింది. బాధితురాలు పలు దఫాలుగా రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి, తాను పెట్టిన నగదుతోపాటు రెట్టింపైన నగదును ఇవ్వాలని అడిగింది. అపరిచిత వ్యక్తులు స్పందించకపోవడంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు వేదికలో చోరీ

రేగోడ్(మెదక్): రైతు వేదికలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన మండలంలోని టీ.లింగంపల్లిలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ పోచయ్య కథనం ప్రకారం.. లింగంపల్లి గ్రామ ఏఈఓగా సుభాశ్ విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతీ మంగళవారం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేస్తారు. ప్రతీ వారంలాగే నిన్న రైతు వేదిక వద్దకు వెళ్లగా తాళం పగులకొట్టి ఉంది. కార్యాలయంలోకి వెళ్లి చూడగా వీడియో కాన్ఫరెన్స్‌కు సంబంధించిన రెండు స్పీకర్‌లు, ఆరు మైక్‌లు, కీబోర్డు, మౌస్ కనిపించలేదు. దొంగలు చోరీకి పాల్పడినట్లు గుర్తించి ఏఈఓ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పేటలోని బీసీ కాలనీలో నివాసం ఉండే సిరిగద్దె సత్తయ్య టీవీఎస్ ఎక్సెల్‌పై చౌరస్తాకు వెళ్తుడు. ఇదే సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్యకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

బాలికల్లో ఆరోగ్యంతోపాటు ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల కిందట తెచ్చిన బాలికల సమగ్ర పథకం సత్ఫలితాలనిస్తోంది. ప్రతీయేటా వేల సంఖ్యల్లో బాలికలకు శిక్షణ ఇవ్వడంతో వారిలో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంవత్సరం నుంచి రాణీ లక్ష్మీబాయ్ ఆత్మరక్ష శిక్షణ పథకంగా పేరు మార్చడంతోపాటు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

– నంగునూరు(సిద్దిపేట)


నంగునూరులో కరాటేలో శిక్షణ పొందుతున్న బాలికలు

- సత్ఫలితాలనిస్తున్న 'బాలికల సమగ్ర పథకం'
- ఇటీవలె పేరు మార్చి నిధులు మంజూరు చేసిన కేంద్రం
- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 258 పాఠశాలలు ఎంపిక
- మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షకుడితో తర్ఫీదు
- ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెంపు

మహిళలు, బాలికలపై దాడులు అరికట్టేందుకు జూడో, కరాటే, మార్షల్ ఆర్ట్స్, బేసికల్ డిఫెన్స్ టెక్నిక్, స్వీయరక్షణ పద్ధతులు ఎంతో ఉపయోగపడుతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 6 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు ఆత్మరక్షణ విద్యను తప్పనిసరిగా చేయాలని సంకల్పించింది. 2020లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ (డీఓఎస్‌ఈఎల్) సమగ్ర శిక్షణ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలతో పాటు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న బాలికలకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.

రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ

గతేడాది ఈ పథకం గడువు ముగియడంతో ప్రభుత్వం పథకాన్ని మరోసారి పొడిగిస్తూ రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ కార్యక్రమంగా పేరు మార్చింది. నిర్వహణ కోసం రూ 38.7 లక్షలు మంజూరు చేయడంతోపాటు కరాటే శిక్షకుడికి గౌరవ వేతనాన్ని నెలకు రూ.5 వేలు పెంచారు. ఈ ఏడాదికిగాను సిద్దిపేట జిల్లాలోని 258 పాఠశాలలను పథకం కింద ఎంపిక చేశారు. వీటిలో 203 ఉన్నత, 13 ప్రాథమికోన్నత పాఠశాలలు, 16 సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలు, నాలుగు తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, 22 కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఎంపిక చేశారు.


కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు



మూడు నెలలపాటు

శిక్షణ కింద ఎంపికైన పాఠశాలల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో సెషన్‌లో 50 నిమిషాల పాటు మెళకువలు నేర్పిస్తారు. నెలకు 12 సెషన్ల చొప్పున మూడు నెలల కాలంలో 36 సెషన్లలో శిక్షణ కాలం పూర్తవుతుంది. శిక్షణలో శారీరక దృఢత్వం పెరుగుదల, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, దాడి చేస్తే ప్రతిదాడి చేసే టెక్నిక్‌లు నేర్చుకుంటున్నారు. మండలంలోని నర్మేటలో గల కస్తూర్బా పాఠశాలలో కరాటే శిక్షకురాలిగా బీ.అనిత, పాలమాకుల, నంగునూరు, రాజగోపాల్‌పేట, బద్దిపడగ, గట్లమల్యాల, నర్మేట, మగ్దుంపూర్, అంక్షాపూర్ ఉన్నత పాఠశాలలో ఎల్లదాసు విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు.

బాలికలు తప్పనిసరిగా నేర్చుకోవాలి



రెండు నెలలుగా కరాటే నేర్చుకోవడంతో నాలో ధైర్యం పెరిగింది. ఎవరైనా దాడి చేస్తే ఎలా రక్షించుకోవాలో తెలిసింది. అలాగే ఆయుధాలు లేకుండా ఎలా ఎదుర్కోవాలో శిక్షణలో నేర్చుకున్నా. బాలికలు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలి.

– జీ.భవ్యసాయి, విద్యార్థి, మగ్దుంపూర్

ఆత్మస్థైర్యం పెరుగుతోంది

విద్యార్థినులకు కరాటే నేర్పించడం వల్ల ఆరోగ్యంతోపాటు ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఎవరైనా దాడులు చేస్తే ఎలా స్పందించాలి, ఎలా తిప్పికొట్టాలో నేర్పిస్తున్నా. ఐదేళ్లుగా స్కూళ్లలో కరాటే నేర్పిస్తూ ఎంతో మంది బాలికలకు శిక్షణ ఇవ్వడం సంతృప్తినిచ్చింది.

– ఎల్లదాసు, కరాటే శిక్షకుడు

25 వేల మందికి శిక్షణ



సిద్దిపేట జిల్లాలోని 258 పాఠశాలల్లో సమగ్ర శిక్ష ద్వారా ఆత్మరక్షణ విద్యను అమలు చేస్తున్నాం. మొత్తం కలిపి 25 వేల మంది విద్యార్థినులు కరాటేలో మెళకువలు నేర్చుకుంటున్నారు. రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష శిక్షణ పథకాన్ని పటిష్టంగా అమలయ్యేలా కృషి చేస్తాం.

– ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, సిద్దిపేట

సర్వీస్ రోడ్డు పనులు వేగవంతం చేయండి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ఎగ్జిట్–2 వద్ద సర్వీస్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంగళవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల ఎగ్జిట్–2 వద్ద సర్వీస్ రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్డు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు. పదేళ్లుగా టోల్ ఫీ వసూళ్లపై చూసిన శ్రద్ధ సర్వీస్‌రోడ్డు నిర్మాణంలో చూపి ఉంటే ఇప్పటికే రోడ్డు పూర్తయ్యేదని ఆరోపించారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న రైల్వేబ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను కలసి చర్చించారు.

ఫొటో, వీడియో గ్రాఫర్లు ఆర్థికంగా ఎదగాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

అధ్యక్షుడు నాగుల విజయ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు ఐక్యతతోనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని సదాశివపేట ఫొటో, వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగుల విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం సంఘం సమావేశం శ్రీకృష్ణ మందిరం ప్రాంగణంలో నిర్వహించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు ఏకాభిప్రాయంతో ఐక్యమత్యంగా ధరలను నిర్ణయించి ఒక్కతాటిపై ఉండాలని తీర్మానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో కొత్త టెక్నాలజీల కెమెరాల కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాల్సిన వస్తుంది. అందుకు అనుగుణంగా ధరలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి జయచింతన్, కోశాధికారి కరుణాకర్, శ్రీనివాస్, అశోక్, నరేష్, మధు, రాము, సంగమేష్, రాజు, నాగేష్, వీరేశం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్


వివరాలను వెల్లడిస్తున్న ఎస్సై శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను తొగుట ఎస్సై రవికాంత్‌రావుతో కలిసి వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సుధీర్‌కుమార్(26) మూడు నెలల కిందట మేదినీపూర్ గ్రామ శివారులో సంతోష్‌కుమార్‌కు చెందిన డెయిరీ ఫామ్‌లో కూలీ పనికి చేరాడు. పనిలో చేరేటప్పుడే గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని కొనుగోలు చేసుకొని వచ్చాడు. పని ముగిసిన తర్వాత రోజూ గంజాయి తాగేవాడు. మేదినీపూర్ శివారులోని పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద కొందరు యువకులు గుమిగూడటంతో తన వద్ద ఉన్న 109 గ్రాముల గంజాయిని వారికి అమ్ముదామని వచ్చాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై శ్రీనివాస్ పోలీసులతో దేవాలయం వద్దకు వెళ్లగా సుధీర్ కుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.2,200 వరకు ఉంటుంది. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో సుధీర్ కుమార్ గంజాయి విక్రయించేందుకు అలవాటు పడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని సిద్దిపేట కోర్టులో నిందితుడిని హాజరు పర్చగా కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొమురవెల్లిలో అఘోరీ హల్‌చల్

- జనంపై కత్తితో దాడి, ఒకరికి తీవ్రగాయాలు
- ఓ విలేకరి సెల్‌ఫోన్ ధ్వంసం


కత్తితో హల్‌చల్ చేస్తున్న అఘోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన అఘోరీ (నాగసాధువు) మంగళవారం హల్‌చల్ చేసింది. కత్తితో జనంపైకి దూసుకువచ్చి దాడికి పాల్పడింది. ఈ క్రమంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. భక్తులందరూ భయభ్రాంతులకు గురయ్యారు. ముందుగా ఆలయంలోకి వెళ్లి స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రయత్నించింది. దిగంబరంగా కాకుండా వస్త్రాలు ధరించి స్వామి వారిని దర్శించుకుకోవాలని ఆలయ అధికారులు సూచించారు. దీంతో కోపోద్రిక్తురాలైన అఘోరీ ఒక్క సారిగా కత్తిని చేత పట్టుకుని హంగామా సృష్టించింది. ఈక్రమంలో స్థానికునికి తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉండి వీడియో చిత్రీకరిస్తున్న ఓ విలేకరి సెల్‌ఫోన్ లాక్కొని ధ్వంసం చేసింది. అంతే కాకుండా ప్రజలను తీవ్ర పదజాలంతో దూషించింది. అనంతరం తన వద్ద ఉన్న నల్లని వస్త్రాలు ధరించి స్వామి వారిని దర్శించుకున్నారు. పోలీసులు అక్కడికి చేరుకుని అఘోరీని పంపించడంతో సమస్య సద్దు మణిగింది. అఘోరీలు దైవ మార్గంలో ఉంటూ భక్తులకు మార్గదర్శకంగా ఉండాల్సింది పోయి భక్తులపై దాడి చేయడం ఏమిటని స్థానికంగా చర్చనీయంశమైంది. అఘోరీ కొంత కాలంగా తెలుగు రాష్ట్రాలలో ఉద్రిక్తతలు సృష్టిస్తున్న విషయం విధితమే.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(వేములఘట్)కు చెందిన తలమైన సత్తయ్య(45)కు 20 ఏళ్ల కిందట రేఖతో వివాహం జరుగగా వీరికి కుమారుడు ఉన్నాడు. రేఖ కాలికి గాయం కావడంతో కొంతకాలంగా తల్లి గారింటి వద్ద ఉంటుంది. కుమారుడు హాస్టల్‌లో చదువుకుంటున్నాడు. భార్య రేఖకు ఫోన్ చేసినా ఇంటికి రాకపోవడంతో ఇద్దరి మధ్య అప్పుడప్పుడూ గొడవ జరుగుతుండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో తీవ్ర మనోవేదనకు గురైన సత్తయ్య ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో గమనించిన చుట్టుపక్కల వారు రేఖకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి వృద్ధురాలు

రామాయంపేట(మెదక్): చెరువులో దూకి వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రామాయంపేటలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన చాకలి పోచవ్వ (75) ఏడాది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఆమె కుమారుడు పలు ఆస్పత్రుల్లో చూపించినా తగ్గలేదు. రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటిలో నుంచి వెళ్లిపోయిన పోచవ్వ మల్లె చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పొలంలో పడి యువ రైతు మృతి


చేతన్ (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): వ్యవసాయ పొలం గట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి యువరైతు మృతి చెందిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. మాసాయిపేట మండలం హకీంపేట గ్రామానికి చెందిన పత్తి చేతన్(35) రోజుమాదిరిగా పిల్లలను బడికి పంపించి మంగళవారం ఉదయం వ్యవసాయ పనుల కోసం గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. కొద్దిసేపటికి భార్య రజిత ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. చేతన్ సోదరుడు వెంకటేశ్‌తో కలిసి పొలం వద్దకు వెళ్లింది. అక్కడ వెతుకుతుండగా పొలంలో బోర్లాపడి చనిపోయి కనిపించాడు. పంటచేనులో నీరు చూడడానికి వెళ్లి ప్రమాదవశాత్తు బురదలో పడి ఊపిరాడకపోవడంతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గృహిణి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గృహిణి మృతి చెందిన ఘటన కొల్లూరులో చేటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సరాయి ఖతూర్ (20)కి అదే రాష్ట్రానికి చెందిన జాంగీర్‌తో వివాహం జరిగింది. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. గతేడాది జీవనోపాధికి తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరుకు వలసొచ్చారు. స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 26న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఖతూర్ గదిలో చీరతో ఉరేసుకుంది. చుట్టుపక్కల గమనించి కిందకి దింపి రక్షించారు. తిరిగి 27న ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉందని భర్తకు చెప్పడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిస్త పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ నవీన్ కుమార్


మాట్లాడుతున్న డాక్టర్ నవీన్ కుమార్

మెదక్‌జోన్: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఇందుకోసం గ్రామ గ్రామాన విస్తృతంగా సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌లోని వైద్యారోగ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ , ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 31 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారని అన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ అధికారి శంకర్ రాథోడ్, డీపీఎంఓలు జాఫర్, లక్ష్మణ్, రాములు, సంతోష్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

హత్నూర(సంగారెడ్డి): భర్తను హత్య చేయించిన భార్యతోపాటు ఇందుకు సహకరించిన నలుగురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు జిన్నారం సీఐ ఎండీ నయీముద్దీన్ తెలిపారు. హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సుభాష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. కామారెడ్డి జిల్లా బిక్నూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మల్లె నారాయణ (42) వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్య లక్ష్మీనర్సవ్వ, ప్రియుడు కడారి రాకేష్, చెట్లపల్లి సాగర్, కడారి శ్రీకాంత్, డప్పు శ్రీకాంత్ కలిసి హత్య చేయించిన విషయం తెలిసిందే. పథకం ప్రకారం తన ప్రియుడైన రాకేశ్‌కు రూ.40 వేలు సుపారీ ఇచ్చింది. లక్ష్మీ నర్సవ్వ ఖానాపూర్‌లో ఉండే భర్త దగ్గరకు మూడు రోజుల కిందట వచ్చింది. అతడు ఆఫీసులో ఉండగానే తాగడానికి కల్లు తెమ్మని చెప్పింది. అతడు వచ్చే లోపు పథకం ప్రకారం నలుగురు నిందితులు వచ్చి ఆఫీసులోని ఓ గదిలో దాక్కున్నారు. నారాయణ కల్లు తీసుకొని రాగానే వారి వెంట తెచ్చుకున్న కత్తి, కట్టే ఇనుప రాడుతో ఒక్కసారిగా దాడి చేసి నరికి చంపేశారు. ఈ హత్యపై ఎస్సై సుభాష్ తనదైన శైలిలో విచారణ చేయగా భార్య లక్ష్మీతోపాటు మరో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కారు, కత్తి కట్టే ఇనుప రాడును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

స్కూల్ వెళ్తున్నానని వెళ్లి బాలిక..

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలిక (12) మంగళవారం స్కూల్‌కి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్కూల్ యజమాన్యాన్ని అడుగగా రాలేదని చెప్పారు. బాలిక కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక అదృశ్యంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెద్దనాన్న ఇంటికెళ్తున్నానని యువతి

యువతి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (21) డిగ్రీ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. 27న పెద్దనాన్న ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పెద్దనాన్న ఇంటి వద్ద తెలుసుకోగా రాలేదని చెప్పారు. స్నేహితుల ఇళ్ల వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన యువకుడు సుభాష్ పై అనుమానం ఉందని అతనూ కనబడటం లేదని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో తండ్రి మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి వెళ్లి వ్యక్తి..

మునిపల్లి(అందోల్): ఇంటి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన సదాశిపేట మండలం మాలపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తలహారి మోమన్ బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారులో కట్టెలు తెస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బుస్సారెడ్డిపల్లి గ్రామ శివారు సింగూర్ ప్రాజెక్టు 17 గేటు దగ్గర బోటులో తలారి మోహన్ దుస్తులు, చెప్పులు, గొడ్డలి ఉన్నట్లు గుర్తించారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రాజేశ్ నాయక్ తెలిపారు. మోమన్ తల్లి తలారి పూలమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలలపై హింసను అరికట్టాలి

- మెదక్ అదనపు ఎస్పీ మహేందర్
- లింగ ఆధారిత హింస నిర్మూలనపై సమీక్ష సమావేశం


కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, తదితరులు

మెదక్ మున్సిపాలిటీ: సమాజంలో బాలలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మాయా గార్డెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల సహకారంతో ప్లాన్ ఇండియా స్వచ్ఛంద సంస్థ వారు లింగ ఆధారిత హింస నిర్మూలనపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అదనపు ఎస్పీ మహేందర్, సీనియర్ సివిల్ జడ్జ్ జితేందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాలల సంరక్షణ కోసం నాల్సా స్కీమ్ 2024లో భాగంగా జిల్లాలో ఎల్సీయూసీని ప్రారంభించినట్లు తెలిపారు. బాలలపై హింసను నిరోధించేందుకు సమాజంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందన్నారు. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని, దీని ద్వారా తోటి విద్యార్థుల్లో కూడా ఆత్మ స్థైర్యం పెంపొందించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా బాలల సంరక్షణ అధికారి కరుణ షీలా మాట్లాడుతూ.. జిల్లాలో బాలలకు సంబంధించి మిషన్ వాత్సల్య కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనాథ పిల్లల సంరక్షణలో తీసుకుంటున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లాలోని న్యాయమూర్తులు, భరోసా, సఖీ, షీ టీం, విద్యాశాఖ, ప్లాన్ ఇండియా ప్రాజెక్టు నుంచి సీనియర్ ప్రాజెక్ట్ లీడ్ సుధీర్ కుమార్ రాయ్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ రాహుల్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సుజాత రాజ్, వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్స్ మంజుల, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.